

తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎం్రడియాల్ గ్రామస్థులు

ఈ జీపీవో మాకొద్దు

- విధుల్లో నిర్లక్ష్యం
- జీపీవోను తొలగించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం

తాడ్వాయి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం్రడియాల్ గ్రామ జీపీవో (గ్రామ పంచాయతీ ఆఫీసర్) మధు తమకు వద్దని మంగళవారం తహసీల్దార్ శ్వేతకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. విధుల్లో సమయపాలన పాటించడం లేదని.. ఇప్పటి వరకు గ్రామంలో ఉండడం లేదని వారు అన్నారు. అలాగే ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఏం చేస్తారో చేసుకోండి.. ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అని సమాధానం ఇస్తున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామాల్లో విధులు కూడా సక్రమంగా నిర్వహిస్తలేదని అంటున్నారు. ఏదైనా సర్టిఫికెట్ అవసరం ఉండి ఫోన్ చేస్తే ఎక్కడో ఉన్నానని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. ఇకనైనా జీపీవోలు గ్రామాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి పత్రంలో కోరారు.

జీపీవో అందుబాటులో ఉండేలా చూడాలి



- సుధాకర్‌రావు, మాజీ ఉప సర్పంచ్

ఎం్రడియాల్ గ్రామంలో జీపీవో మధు సక్రమంగా విధులు నిర్వహించడలం లేదు. ఫోన్ చేస్తే ఇష్టం వచ్చినట్లు సమాధానం ఇస్తున్నాడు. గ్రామంలో జీపీవో అందుబాటులో ఉండేలా చూడాలి.

మెంగారంలో రోడ్డుపైకి వచ్చిన చిరుత

లింగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని మెంగారం శివారులో చిరుత మంగళవారం రాత్రి 7 గంటలకే ఎల్లారెడ్డి-కామారెడ్డిపైకి రావడంతో అటుగా వెళుతున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు చిరుతను తమ సెల్‌ఫోన్‌లలో వీడియో తీశారు. చిరుత రాత్రి 7 గంటలకే రోడ్డుపైకి రావడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం అదే దారిలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ వాహనానికి ఎదురగా వచ్చిన చిరుత మంగళవారం ఆర్టీసీ బస్సుకు ఎదురురావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి వెంటనే చిరుతను బంధించి జూపార్క్‌కు తరలించాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తుది దశకు
ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 3.97 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- 112 కొనుగోలు కేంద్రాల మూసివేత
- రూ. 950.33 కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు
- 80 శాతం రైతులకు రూ.762.86 కోట్లు జమ

7

యంత్రం.. పని మంత్రం

- డ్రమ్ సీడర్‌తో వరి నాట్లకు ఆసక్తి
- ఖర్చుల ఆదాకు వివిధ ప్రయత్నాలు

6

పంచాయతీ ఎన్నికల్లో రెండో విడత నామినేషన్ల పర్వం మంగళవారంతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాత్రి 8 గంటల వరకు అభ్యర్థులు భారీగానే నామినేషన్లను వేశారు. కాగా మొదటి విడత నామినేషన్ల ఉప సంహరణ గడువు బుధవారంతో ముగియనుంది. ఈ రోజు రాత్రి వరకు మొదటి విడత పోటీ చేసే అభ్యర్థులెవరో తేలనుంది. దీంతో వీరికి అధికారులు గుర్తులు కేటాయించనున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసిన అభ్యర్థులను విరమించుకోవాలని బుజ్జగిస్తున్నారు. దీంతో ఓట్లు చీలకుండా తామే అత్యధిక మెజార్టీతో గెలువ వచ్చని భావిస్తున్నారు.




ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం

- 197 సర్పంచ్ స్థానాలకు 935 నామినేషన్లు
- 1,654 వార్డులకు 2,905 నామినేషన్లు దాఖలు
- నేటి నుంచి మూడవ విడత నామినేషన్ల పర్వం
- తేలనున్న మొదటి విడత అభ్యర్థుల లెక్క
- పల్లెల్లో నెలకొంటున్న ఎన్నికల వార్



కామారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండవ విడత గ్రామ పంచాయతీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. రెండవ విడత నామినేషన్లకు చివరి రోజు అయిన మంగళవారం భారీ నామినేషన్లు దాఖలయ్యాయి. రాత్రి వరకు నామినేషన్లు వేసేందుకు కేంద్రాల్లో అభ్యర్థులు ఆసక్తి చూపారు. రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో నేటి నుంచి మూడవ విడత నామినేషన్లకు సంబంధించి నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి బుధవారం జారీ చేయనున్నారు. మొదటి విడతకు సంబంధించి నామినేషన్ల ఉప సంహరణ గడువు బుధవారం ఉంది. దీంతో బరిలో ఉండే అభ్యర్థుల లెక్క నేడు తేలనుంది. ఈ నేపథ్యంలో రెబల్స్‌ను బరిలో నుంచి తప్పించేలా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. రెండవ విడతలోను ఏకగ్రీవాలపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి.



రెండవ విడతలో నామినేషన్ల జోరు

జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడతలో ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో నామినేషన్ల ప్రక్రియ మూడు రోజుల పాటు కొనసాగింది. మొదటి రోజు నామినేషన్లు అంతంత మాత్రంగానే నామినేషన్లు వేసినప్పటికీ సోమవారం మంచి రోజు కావడంతో చాలా మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇక మంగళవారం చివరి రోజు కావడంతో పెద్ద మొత్తంలోని ఆశావహులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీకి సుమారు 5 నుంచి 10 మంది వరకు నామినేషన్లు వేసినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామ పంచాయతీలో ఆశావహులు సర్పంచ్ పదవి కోసం పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చారు. రెండవ విడతలోనూ భారీగానే నామినేషన్లు దాఖలయ్యాయి. ఏడు మండలాల్లోని 197 సర్పంచ్ స్థానాలకు 935, 1,654 వార్డు స్థానాలకు 2,905 నామినేషన్లు దాఖలయ్యాయి. సాయంత్రం 5 గంటలలోపు కేంద్రాలకు వచ్చిన వారికి టోకెన్లు జారీ చేశారు. టోకెన్లు తీసుకున్న అభ్యర్థుల నుంచి అర్ధ రాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది.

రెండవ విడతలో దాఖలు అయిన నామినేషన్లు ఇలా..

మండలం	సర్పంచ్ స్థానాలు	నామినేషన్లు	వార్డు స్థానాలు	నామినేషన్లు
లింగంపేట్	41	182	342	597
నాగిరెడ్డిపేట్	27	98	232	396
గాంధారి	45	229	366	611
ఎల్లారెడ్డి	31	101	246	338
మహ్మద్‌నగర్	13	75	112	227
నిజాంసాగర్	14	90	122	239
పిట్లం	26	160	234	497
మొత్తం	197	935	1654	2,905

నేడు మూడవ విడత నామినేషన్లు

జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మూడవ విడత నోటిఫికేషన్‌కు (మిగతా 8లో..)



నారుమడులను పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

నారుమడి యాజమాన్య పద్ధతిలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 2: ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామంలో గల హిమగిరి శివారులో వరి నాడుమడులను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి యాజమాన్య పద్ధతిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు పంట నాటడానికి వారం రోజుల ముందు ఒక ఎకరానికి సరిపోయే నారుమడికి కిలో కార్బోఫురన్ 3జీ గుళికలు వేసుకోవాలన్నారు. దీని వల్ల రైతు నాటిన తర్వాత పంటకు ఆశించే కాండం తొలుచు, ఆకుముడత పురుగును అరికట్టవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అనీల్‌కుమార్, ఏఈవో రాజాగౌడ్, రైతులు లక్ష్మయ్య, నారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో..

పంచాయతీ పోరు



నాగిరెడ్డిపేటలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు

- జిల్లాలో ఐదు ప్రత్యేక పోస్టుల ఏర్పాటు
- జిల్లాలో ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లతో వాహనాల తనిఖీలు ముమ్మరం
- డబ్బు, మద్యం తరలించకుండా గట్టి నిఘా

నాగిరెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తిగా నిఘా నీడలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేసింది. స్థానిక పోలీసులకు అదనంగా ప్రత్యేక పోలీసు బలగాలతో, విస్తృత తనిఖీలు నిర్వహించడం ద్వారా నగదు. మద్యం, ఇతర ఓటర్లకు ప్రలోభాలకు గురిచేసే నజరానాలను తరలించకుండా ప్రకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతంలో స్టాటిక్ సర్వీలెన్స్ టీం (ఎస్ఎస్‌టీ) ప్రత్యేక చెక్ పోస్టుల ఏర్పాటు ద్వారా, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ)ల ఏర్పాటు ద్వారా ప్రత్యేక బృందాలు ప్రధాన రహదారుల వద్ద వాహనాల రాకపోకలపై గట్టి నిఘా వేసి తనిఖీలు ముమ్మరం చేశాయి. జిల్లాలో 25 మండలాల్లో 532 గ్రామ పంచాయతీలకు గాను, 532 సర్పంచ్ స్థానాలకు, 4,656 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 6,39,730 మంది ఓటర్లు ఉండగా, అందులో 3,07,508 మంది పురుషులు, 3,32,209 మంది మహిళలు, 13 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలో మూడు విడతల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఆరు లక్షల 39వేల 730 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లాలో ఇప్పటికే రెండు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో సమస్యాత్మకంగా ఉన్న గ్రామాలను అధికారులు ముందుగానే గుర్తించి ఆయా సమస్యాత్మక గ్రామ (మిగతా 8లో..)



గుండెకు.. చలిపోటు

చలి.. నిలువెత్తు మనిషిని వణికిస్తుంది. గుప్పెడంత గుండెనూ భయపెడుతుంది. హృద్రోగ పీడితులే కాదు, పరిపూర్ణ ఆరోగ్యవంతులు సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయమిది. వృద్ధులకైతే పరీక్షా కాలమే. పోషక విలువల ఆహారం, ఎంతో కొంత శారీరక శ్రమ, రుగ్మతల పట్ల అవగాహన.. ఇవే ఉన్ని దుస్తుల్లా మనల్ని చలి పులి నుంచి రక్షిస్తాయి. చలికాలం హృద్రోగులకు గడ్డుకాలం. చలి శరీరంలోని పలు అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆరోగ్యవంతులకు సైతం గుండెపోటు వచ్చే ఆస్కారం లేకపోలేదు. అన్ని వయసుల వారిపైనా చలి పులి పంజా విసురుతోంది. బయట ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు శరీరంలోని రక్తనాళాల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. 'సింపథెటిక్ నర్వస్ సిస్టమ్' చురుకుదనం పెరుగుతుంది. వీటన్నిటి వల్ల గుండె సమస్యలు ఉత్పన్నం అవుతాయి. నిజానికి చలికి, గుండెకు ఉన్న సంబంధం విడదీయలేనిది.

- ఉష్ణోగ్రతలు తగ్గడంతో పొంచి ఉన్న ప్రమాదం
- అంతర్గతంగా పెరిగే ఒత్తిడి హృదయానికి చేటు
- తగిన జాగ్రత్తలు తప్పనిసరి

కామారెడ్డి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చలి అంటేనే బయటి వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయినప్పుడు మనిషి శరీరంలోని రక్తనాళాలు కుంచించుకుపోతాయి. దీనివల్ల అంతర్గత ఒత్తిడి పెరుగుతోంది. ఫలితంగా 'సింపథెటిక్ నర్వస్ సిస్టమ్' చైతన్యవంతం అవుతుంది. హృదయ స్పందన పెరుగుతోంది. అంటే, గతంతో పోలిస్తే గుండె ఎక్కువసార్లు కొట్టుకుంటుంది. రక్తనాళాలపై ఒత్తిడి (షియర్ స్ట్రెస్) అధికమై బీపీ అమాంతం పెరిగిపోతోంది. ఇవన్నీ గుండెపై ప్రభావం చూపుతాయి. ఇలా.. చలి అనేక రకాలుగా గుండెను దెబ్బ తీస్తోంది.

రక్తం గడ్డకడితే..

మిగతా రోజులతో పోలిస్తే చలి కాలంలో రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే స్వభావం 14 నుంచి 20 శాతం అధికం అవుతోంది. ప్లేట్‌లెట్స్ తీవ్రంగా స్పందించడం వల్లే ఇలా జరుగుతోంది. రక్తం గడ్డకట్టడం వల్ల గుండెకు రక్త సరఫరా మందగించి, గుండెపోటు సంభవిస్తోంది లేదా గుండె విఫలం అవుతోంది.

వ్యాయామం లేకపోతే..

చలి కాలంలో బద్ధకం పెరుగుతోంది. ఆలస్యంగా నిద్రలేస్తారు. చలి భయంతో నాలుగు గోడలకే పరిమితం అవుతారు. నడక, వ్యాయామం పూర్తిగా పక్కన పెట్టేస్తారు. బయటికి వెళ్లాల్సిన పనులు వాయిదా వేసుకుంటారు. మిగతా రోజులతో పోల్చి.. రెండు మూడు గంటలు ఎక్కువ విశ్రాంతి తీసుకుంటారు. దీనివల్ల ఒంట్లో కదలికలు తగ్గుతాయి. శారీరక కదలికలు తగ్గడమనేది అన్ని విధాలుగా చెడు ప్రభావం చూపుతోంది. గడ్డకట్టుకు పోయిన రక్తం ఊపిరితిత్తుల్లోని ధమనిని అడ్డు కుంటుంది. 'పల్మనరీ ఎంబాలిజం' అంటే ఇదే. ఆ ఫలితంగా రోగికి ఊపిరి ఆడదు. ఇట్టే ఆయాసం వచ్చేస్తోంది. సమస్య తీవ్రమైతే గుండె రుగ్మతకు దారి తీస్తోంది.

వైఫల్యాలు అధికం

గుండెనొప్పిని తొలిసారిగా 1772లో గుర్తించారు. ఒక వ్యక్తి ఏదో గుట్టను ఎక్కుతున్న సమయంలో.. తీవ్రమైన చల్లగాలి తాకినప్పుడు ఛాతిలో పుట్టిన అసౌకర్యాన్నే గుండె నొప్పిగా పరిగణించారు. దీన్నే (మిగతా 8లో..)



పండుగల పరవళ్లు

సంవత్సరం చివరి నెలగా వచ్చిన డిసెంబరు కామారెడ్డి జిల్లాకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరిమళభరితంగా మార్చింది. వైకుంఠ ఏకాదశి సమీపిస్తున్న వేళ దేవాలయాలు కొత్త వెలుగులతో మెరిసిపోతున్నాయి. చల్లని గాలులతో పాటు మురిపించే పూల వాసన కలిసిపోవడంతో ఉదయాన్నే ఆలయాల వద్ద భక్తులు రద్దీగా కనిపిస్తున్నారు. సంవత్సరం ముగింపుని ఆధ్యాత్మికతతో ఆహ్వానిస్తూ దేవాలయాలు ఒక్కొక్కటిగా పండుగల బాటలోకి అడుగుపెడుతున్నాయి. ధనుర్మాసం ప్రారంభం కావడంతో గ్రామాల నుంచి పట్టణాల వరకు విశేషాలు కనిపిస్తున్నాయి.

- భక్తి పరిమళాలతో సంబురాల పరంపర
- వైకుంఠ ద్వారానికి ఆహ్వానం
- ధనుర్మాసం దివ్య ధార
- పవిత్ర వ్రతాల పర్వం
- నెల మొత్తం ఆధ్యాత్మిక శోభ

కామారెడ్డి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 4వ తేదీ బుధవారం దత్తపూజలతో జిల్లాలోని ఆలయాలు కాంతులీననున్నాయి. భక్తులు తెల్లవారుజామునే దీక్ష తీసుకుని ఆలయాలకు వెళ్లే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హోమాలు, అర్చనల కోసం పురోహితులు ప్రత్యేక పూజా సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. దత్తాత్రేయ స్వామి ఆశీర్వాదాలు పొందాలని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలనుకుంటున్నారు. ఈ పూజల కారణంగా నిజామాబాద్ నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం (మిగతా 8లో..)

రైతుల వెన్నెముక విరిచేలా విత్తన చట్టం ముసాయిదా

- రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్



గడుగు గంగాధర్

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతుల వెన్నెముక విరిచేలా విత్తన చట్టం ముసాయిదా చేయబోతోందని, తద్వారా రైతుల విత్తనహక్కును కార్పొరేట్‌పరం కాబోతున్నదని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. మంగళవారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. విత్తన ధరల నిర్ణయం కార్పొరేట్ కంపెనీల చేతిల్లోకి వెళ్లిపోతుందని, దాంతో ప్రభుత్వానికి అధికారం ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని విత్తనాల వల్ల రైతులకు నష్టం జరిగినా, దానికి పరిహారం పొందే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలపై రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న అధికారాలు ఇక కేంద్రం చేతుల్లోకి వెళతాయన్నారు. విదేశీ విత్తనాలను స్వేచ్ఛగా మన దేశంలో అమ్ముకునే వెసులుబాటు కలుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతన విత్తన చట్ట ముసాయిదాను ప్రజల ముందు ఉంచిందని ఈ నెల 11వ తేదీ వరకు అభిప్రాయాలు చెప్పాలని కోరినట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా కొత్త విత్తన చట్టం తీసుకవస్తున్నామని ప్రకటించినా అది వాస్తవం కాదన్నారు. విత్తనాల రిజిస్ట్రేషన్, విత్తన కంపెనీల లైసెన్స్, ఇతర అన్ని కీలక అధికారాలు కేంద్రం చేతిలో ఉంటాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పత్తి విత్తనాల చట్టం తెచ్చి ధరలను నియంత్రించిందని తెలిపారు.

అంతర్ రాష్ట్ర నకిలీ నోట్ల నిందితులపై పీడీ యాక్ట్

కామారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ నోట్లను చెలామని చేస్తున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరు నేరస్తులపై మంగళవారం పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఇటీవల కామారెడ్డి పట్టణ కేంద్రంలో వైన్స్ దుకాణాల్లో రెండు నకిలీ రూ.500ల నోట్లను చెలామని చేసిన కేసులో జిల్లా పోలీసులు దర్యాప్తు చేయగా పశ్చిమ బెంగాళ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన 11 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ ముఠాలోని ముగ్గురు నేరస్తులపై పీడీయాక్ట్ నమోదు చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులైన దివాకరి చౌదరి, హరినారాయణ భగత్‌లపై కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేశారు. పీడీ యాక్ట్ నమోదు పత్రాన్ని టౌన్ సీఐ నరహరి, హెడ్ కానిస్టేబుల్ నర్సింలు అందజేశారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయసేవ సంస్థ కార్యదర్శి నాగరాణి

కామారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి నాగరాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న ఉచిత న్యాయసేవలు, లీగల్ ఎయిడ్ క్లీనిక్ పనితీరు, కార్యకలాపాలు, ఖైదీలకు అవగాహన కార్యక్రమాలపై సమీక్షించారు. అలాగే ఖైదీలతో సమావేశమై వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, హక్కులు, డీఎల్ఎస్ఏ ద్వారా లభించే సేవలను వివరించారు. ఖైదీల్లో న్యాయ అవగాహన పెంపొందించడంతో పాటు వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని సమయానుకూలంగా అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వంట గది, పరసర ప్రాంతాలు, ఫిర్యాదు బాక్స్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాయ సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


ఈర్ల శంకర్

నవీపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని సలీంపారంలో సోమవారం ఈర్ల శంకర్(36) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తిరుపతి తెలిపారు. కూలీ పని చేసుకుని జీవించే శంకర్ ఇటీవల మద్యానికి బానిసయ్యాడని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో శంకర్ చీరతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి భార్య రూప, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


మహేందర్

నాగిరెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో లింకలపల్లి రోడ్డుపై మంగళవారం జరిగిన ప్రమాదంలో లింగంపేట మండలంలోని శట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన మున్నూరు మహేందర్ (30) మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం.. మహేందర్ బైకు పైన నాగిరెడ్డిపేటకు వస్తుండగా, మండలకేంద్రానికి చెందిన నిరుడి పోశెట్టి పొలం వద్దకు బైక్‌పై వెళుతుండగా లొంకలపల్లి రోడ్డుపైన ఎదురుదెరుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మహేందర్ అక్కడికక్కడే మృతి చెందగా.. పోశెట్టి తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రున్ని స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం గురించి తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు. ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.



యంత్రం.. పని మంత్రం

- డ్రమ్ సీడర్‌తో వరినాట్లకు ఆసక్తి
- ఖర్చులు ఆదాకు వివిధ ప్రయత్నాలు

కోటగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు లో పెరుగుతున్న ఖర్చులు అన్నదాతను పట్టిపీడిస్తున్నాయి. కౌలు ఖర్చులు, విత్తనాలు, ఎరువుల ధరల పెంపు, కూలీల కొరతతో అన్నదాత లాభాల బాట పట్టడం అటుంచితే.. పెట్టుబడి రాని పరిస్థితులు ఏర్పడ్డాయి. పెట్టుబడి ఖర్చులు అధిగమించడానికి రైతులు యాంత్రీకరణ వైపు అడుగులు వేయాల్సిన అవసరముంది. చిన్న యంత్రాలతో సొంతంగా సాగు చేసుకుంటే ఇతరులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండదు.

వెదజల్లే పద్ధతి..

ఈ పద్ధతిలో ఎకరాకు 10-15కిలోల విత్తనం అవసరమవుతుంది. విత్తనాలను 24గంటలు నానాబెట్టి మండే కట్టి ముక్కు పగిలిన పొలంలో వెదజల్లాలి. దీని వల్ల నారు పెంచే ఖర్చు, నాట్లు వేయడం ఉండదు.

డ్రమ్ సీడర్ సాయంతో విత్తడం..

విత్తనాన్ని 24 గంటలు నానాబెట్టి మండే కట్టిన తర్వాత డ్రమ్ సీడర్‌లో నింపి ప్రధాన పొలంలో విత్తుకుంటారు. వరుసల మధ్య దూరం ఉండడంతో గాలి, వెలుతురు బాగా అంది యంత్రాల ద్వారా అంతర కృషికి వీలుంటుంది. విత్తన రకాన్ని బట్టి ఎకరాకు 10-15 కిలోలు అవసరం అవుతాయి. నేరుగా విత్తే పద్ధతిలో నత్రజని దమ్ములో వేయకుండా విత్తిన 15, 40-45, 60-65రోజులకు సమంగా అందించాలి. పొటాషియం 2భాగాలుగా చేసి దమ్ములో భాస్వరంతో సగం, మిగత సగం యూరియాతో పాటు 60, 65 రోజుల్లో వేసుకోవాలి. ఇతర పద్ధతులతో పోలిస్తే 10 రోజులు ముందుగానే పంట చేతికి వస్తుంది. ఎకరానికి రూ.5,000-7,500 వరకు ఆదా అవుతుంది.

ట్రేలలో పెంచి..

నారును ట్రేలలో పెంచి ప్రధాన పొలంలో నాటు వేస్తారు. ఎకరాకు 12-15కిలోల విత్తనాలు అవసరం. ఎకరాకు నాటు వేసేందుకు నారుమడికి రూ.4-5వేల ఖర్చు వస్తుంది. ఈ పద్ధతిలో ట్రేలలో నారును పెంచినప్పుడు జింక్, ఇనుప ధాతులోపం అవసరముంది.

మండలంలో ఇదీ పరిస్థితి..

మండలంలోని ఎక్లాస్‌పూర్, రాంపూర్‌లో డ్రమ్ సీడర్ పద్ధతుల్లో వరినాట్లు వేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సుమారు 50ఎకరాలలో డ్రమ్ సీడర్‌తో వరినాట్లు వేశారు. ఎకరానికి 10వేలకు పైగా ఖర్చు తగ్గుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఖర్చులు తగ్గించుకోవాలి:



రైతులు పంటల సాగులో ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రయత్నం చేయాలి. అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ఉపయోగిస్తే కూలీల సమస్య అధిగమించడంతో పాటు ఖర్చు తగ్గించుకోవచ్చు.

- రాజు, వ్యవసాయ అధికారి, కోటగిరి


వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో దేవిక

మెలకువలు పాటిస్తే మెరుగైన దిగుబడి

» జక్రాన్‌పల్లి ఏవో దేవిక

జక్రాన్‌పల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): యాసంగిలో వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తూ పంటను సాగు చేస్తే మెరుగైన పంట అధిగ దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి దేవిక రైతులకు సూచించారు. మంగళవారం జక్రాన్‌పల్లిలో తిరుపతిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వరినారుమళ్లను, కాల్చి వేసిన వరి కొయ్యలను ఆమె పరిశీలించారు. యాసంగిలో చలిని తట్టుకునే వరి రకాలను సాగు చేసుకోవాలన్నారు. సాయంత్రం వేళల్లో నారుమడికి ఒక్క అడుగు మేర ఎత్తులో వెదురు బద్దలు కట్టి వాటిపై ప్లాస్టిక్ కవర్‌తో కప్పి ఉంచాలని, దీన్ని రాత్రి ఉంచి ఉదయం తీసివేసి నారుమడికి నీరు పెట్టాలన్నారు. ఇలా చేయడం వల్ల నారుమడులను చలి నుంచి కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఏవో వెంట స్థానిక రైతులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ఉత్తమ ఫలితాలు సాధించాలి

» ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

జక్రాన్‌పల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిప్యాక్, కేశ్‌పల్లిలోని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా మంగళవారం పరిశీలించారు. ఈ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కొలిప్యాక్ పోలింగ్ బూత్‌లను సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా పరిశీలించారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు. తరువాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం.. నాణ్యమైన కూరగాయలతో మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. సబ్ కలెక్టర్ వెంట ఎంపీడీవో సతీష్ కుమార్, పంచాయితీ కార్యదర్శులు రాజేశ్వర్, ఉపాధ్యాయులున్నారు.

వేలం ద్వారా ఏకగ్రీవాలు నేరం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచులు, వార్డుల సభ్యులను వేలం ద్వారా ఎన్నుకుంటే అది చట్టరీత్యా నేరమని ఆ ఎన్నిక చెల్లదని ఎంపీడీవో రాజాశ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. మండలంలోని అమీర్‌నగర్, కోనాసముందర్, కేసీతండా, డీసీతండా తదితర గ్రామాల్లో పర్యటించి, నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. గ్రామాభివృద్ధి కమిటీలు, ఇతరులు వేలం పాట ద్వారా సర్పంచ్, వార్డు సభ్యులను ఎంపిక చేయరాదన్నారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోరాదని, అభ్యర్థులను భయబ్రాంతులకు గురిచేయడం, నామినేషన్ల ఉపసంహరించుకునేలా చేయడం నేరమన్నారు. ఎక్కడైనా ఏకగ్రీవ ఎన్నిక జరిగితే ఆ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఎన్‌ఓసీ జారీ చేసిన తరువాతే ఎన్నిక చెల్లుతుందన్నారు. క్లస్టర్ గ్రామాలలో నామినేషన్‌ల స్వీకరణ సన్నాహక చర్యలపై రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.ప్రసాద్, ఎంపీవో అధికారి సదాశివ్, ఏఎస్ఐ నరేందర్ తదితర అధికారులు ఉన్నారు.


నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజాశ్రీనివాస్

ఎన్నికల కాలం.. తనిఖీలు ముమ్మరం


సాలూర క్యాంప్ బైపాస్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సాలూర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో సాలూర క్యాంప్ బైపాస్ రోడ్డులో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగవారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు ఇతరత్రా వాహనాలను నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిబంధనలు అధిక్రమించిన ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్వేత స్పష్టం చేశారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే అందుకు సంబంధించిన రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. లేకుండా నగదును సీజ్ చేస్తామన్నారు. మద్యం అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా ఉందని వెల్లడించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమించినట్లు సమాచారం ఇచ్చినట్లయితే తక్షణమే ఆ ప్రాంతానికి వచ్చి తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. ఆమె వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసు అధికారులు ఉన్నారు.

మద్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

ఇందల్వాయి: మండలంలోని ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద సీఐ వినోద్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 50వేల రూపాయల కంటే ఎక్కువ నగదు తీసుకు వెళ్లవద్దని పేర్కొన్నారు. వెండి, బంగారం తీసుకెళితే సరైన పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేకపోతే నగదు, బంగారం, వెండి ఆభరణాలు సీజ్ చేస్తామని వెల్లడించారు. మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రతీఒక్కరు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. ఈ తనిఖీల్లో ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.


ఇందల్‌వాయి టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

» ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ముప్కాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలో ఆయా గ్రామాలలో వివిధ పార్టీ కార్యకర్తలు, అభ్యర్థులకు ఏసీపీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఎవరూ రూ.50వేలకు మించి నగదును రవాణా చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ముప్కాల్ ఎస్సై కిరణ్, ఆయా పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఎన్నికలను శాంతియుతంగా జరుపుకోవాలి

» ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి కోరారు. మంగళవారం వేల్పూర్ మండలం పడిగెల్‌లో ఓటర్లు, రాజకీయ నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటు చాలా విలువైనదని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామాభి వృద్ధి కోసం ఉత్తమమైన నాయకులకు ఎన్నుకోవాలని సూచించారు. తమకు ఓటు వేయాలని ఏ రకంగానైనా బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా అభ్యర్థులు, నాయకులు ప్రచారాన్ని నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సంజీవ్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, సాయికుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సజన్ కుమార్ ఉన్నారు.


పడిగెల్‌లో స్థానిక ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి

ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్‌గా రవిబాబు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవిబాబు నియమితులయ్యారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఎం.రవిబాబు ఇన్‌చార్జి కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామబాద్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదనంగా ఆర్మూర్ మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. మునిసిపల్ కార్యాలయ అధికారులు ఆయనను స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని రవిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ శ్రీనివాస్, సీనియర్‌అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.


ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ ఉద్యోగులు

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న సైకాలజిస్టు మహిపాల్

కోటగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ సైకాలజిస్టు, ఎడ్యుకేషన్ కౌన్సిలర్ మహిపాల్ సూచించారు. పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కేరీయర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రతి అంశంలోనూ సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని మహిపాల్ సూచించారు. తమలోని బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమించడానికి ప్రయత్నిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పదో తరగతి పూర్తి చేసిన వెంటనే తీసుకోవాల్సిన కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోల శంకర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కే.లత, ఉపాధ్యాయులు నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం చేతనకుమారి

ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

ఆర్మూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చేపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీలను సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు ఈ నెల 18న జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం చేతన కుమారి తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఆర్మూర్ రూరల్ ప్రధాన కార్యదర్శి సంగెం అశోక్, దత్తాద్రి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయినులు శ్రీలత, మంజుల, శోభ, స్నిగ్ధ, తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప మహా పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా అయ్యప్ప పడిపూజ

బోధన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓం ఓం అయ్యప్ప శరణం శరణం అయ్యప్ప అంటూ శరణు ఘోషతో అయ్యప్ప స్వాములు పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని విజయసాయి ప్రాథమికోన్నత పాఠశాలలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 18మెట్లను పూలతో అందంగా అలంకరించి గణపతి, కుమార స్వామి, అయ్యప్ప విగ్రహాలను ప్రతిష్ఠించి పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హాజరై భజనలు, కీర్తనలు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ వేదమూర్తులు నిట్టూరి వామన శర్మ, వేద పండితులు సంతోష్ శర్మ, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ చక్రవర్తి, గురుస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

వర్ని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తగిలేపల్లిలో మంగళవారం గజ్జెలమ్మ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయ ప్రకారం గ్రామంలో ఊర దేవతలకు పండుగ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్జెలమ్మకు మొక్కులు సమర్పించుకున్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఉత్సవాలను చేపట్టారు. ఉత్సవాల్లో గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

భీమ్‌గల్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దేవన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు బుక్యా లింబాద్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సహాయం చేయడం తమ సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. మంచి మార్కులు సాధించి, చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీకాంత్, సేవాలాల్ సంఘం ఉపాధ్యక్షుడు అరుణ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, రామవత్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

బోధన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతి మందిరం దుకాణ సముదాయంలోని 1వ నెంబర్ మడిగె వేలంపాట రద్దయినట్లు ఈవో రాములు తెలిపారు. మంగళవారం లీజు లైసెన్స్ వేలంపాట నిర్వహించగా పాటదారులు రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. తదుపరి వేలంపాట ప్రకటనను మళ్లీ తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మందిర చైర్మన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో గీతా జయంతి

నవీపేట,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మంగళవారం గీతా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ నిజామాబాద్ ఇన్‌చార్జి ప్రభుజీ రామానంద గౌరుదాస్, కరస్పాండెంట్ హన్మాండ్లు, హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఏలేటి భూమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం వారింటికి వెళ్లి భూమన్న కుమారులు రాజ్‌పాల్, చిన్నారెడ్డి, సంతోష్‌లను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటానని ఆయన భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత


ఫోన్లను అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

ఆర్మూర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ మంగళవారం పలువురు బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఇటీవల పోలీస్ స్టేషన్ పరిధిలో అంజనేయులు, మహేశ్, లింగమణి పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి, అందజేశామని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మాస్టర్ ప్లాన్‌కు ప్రజలు సహకరించాలి

» బోధన్ మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ

బోధన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోధన్ మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 కార్యక్రమం కింద మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడానికి సంబంధించి డీటీసీపీ హైదరాబాద్ ఆదేశాల మేరకు పట్టణంలోని 38వార్డులలో క్షేత్రస్థాయిలో బుధవారం నుంచి సర్వే ప్రారంభించనున్నట్లు బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. సర్వేలో భాగంగా రోడ్లు, నీటి సరఫరా, డ్రైనేజీ, ఇంటి నెంబర్లు యాజమాని వివరాలు, భవన విస్తీర్ణం మొదలైన మౌలిక సదుపాయల డేటా సేకరణ జరుగుతుందన్నారు. పట్టణ అభివృద్ధికి కీలకమైన ఈ సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సర్పంచ్ టు మంత్రి వయా ఎమ్మెల్యే





కమ్మర్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలం చౌట్‌పల్లికి చెందిన ఏలేటి మహిపాల్ రెడ్డి మండలంలోని కోనాపూర్ సర్పంచ్ నుంచి మంత్రిగా ఎదిగారు. 1981లో భీమ్‌గల్ సమితి ప్రెసిడెంట్ పదవిపట్ల ఆకర్షితులైన ఆయన కోనాపూర్ సర్పంచ్‌గా గెలిచి ఆ పదవిని అలంకరించారు. ఇక 1982లో టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆర్మూర్, బాల్కొండ ప్రాంతానికి చెందిన 70 మంది సర్పంచ్‌లతో కలిసి టీడీపీలో చేరారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ ర్మూర్ ఎమ్మెల్యేగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. 1985లో మళ్లీ పోటీ చేసి గెలుపొంది, రాష్ట్ర అటవీమంత్రిగా ఎదిగారు. ఆ తర్వాత స్వగ్రామం చౌట్‌పల్లిలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన సేవలకు గుర్తుగా మామిడిపల్లి చౌరస్తావద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.

శ్రీరస్తు.. అధికారమస్తు



నిజామాబాద్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ నామినేషన్ల జోరు కొనసాగుతోంది. సర్పంచ్, వార్డు స్థానాలకు బరిలో నిలిచేందుకు రిజర్వేషన్ల వారీగా నాయకులు నామినేషన్లు వేస్తున్నారు. ఇప్పటికే తొలివిడత నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగా రెండో విడత సైతం నిన్నటితో ముగిసింది. కాగా చాలామంది నాయకులు మంచి స్థానిక పురోహితులను కలుస్తూ శుభముహూర్తాలను చూపించుకుంటున్నారు. వారి కి కలిసివచ్చే సమయంలో నామినేషన్లు వేస్తే అధికారం వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. పలువురు అభ్యర్థులు రాజశ్యామల, గణపతి, చండీ హోమాలను నిర్వహించి నామినేషన్ వేయడానికి సిద్ధమవుతున్నారు. ఏ పూజ చేస్తే విజయం వరిస్తుందో ఆ పూజ చేయడానికి అభ్యర్థులు పురోహితులను సంప్రదిస్తున్నారు. మరి ఈ నమ్మకం వారికి అధికారం కట్టబెడుతుందో లేదో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



ఊరంతా ఒక్కటై అభివృద్ధికి టిక్కెట్టై..



ఆర్మూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికల పండగ హడావుడి నడుస్తోంది. ఎక్కడ నలుగురు కలిసినా ఎన్నికల ముచ్చట్లే వినిపిస్తున్నాయి. అయితే కొన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ ప్రజలంతా ఒకే మాటమీద నిలబడి సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చాలా గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా మరిన్ని గ్రామాలు సైతం అదే బాటలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఐకమత్యంతో పాటు ప్రభుత్వం నుంచి మంచి నజరానా వస్తుందనే ఆలోచనలో కూడా ఉన్నారు. ఊరంతా ఒక్కటై తే అభివృద్ధికి బాటలు వేసుకోవచ్చని చూస్తున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ.10 లక్షల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. గత సర్పంచ్ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని రాంపూర్, మిర్ధాపల్లి, మంథని, ఇస్సాపల్లి, ఖానాపూర్ గ్రామాలలో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా భీమ్‌గల్ మండలంలోని 7, కమ్మర్‌పల్లి మండలంలోని 7, నందిపేట్‌లోని రెండు గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి.

నిన్న కారు.. మొన్న హస్తం



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు..



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

ఎన్నికల సిత్రం

బాన్సువాడటౌన్ , డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ ఆయా రాజకీయ పార్టీల్లో చేరికల పర్వం జోరుగా నడుస్తోంది. ఎవరికి అనుకూలించిన పార్టీల్లో వారు చేరుతూ పల్లెపోరుకు సిద్ధమవుతున్నారు. ఇక్కడ ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఒక పార్టీ నుంచి మరొక పార్టీలోకి చేరికన రోజుల వ్యవధిలోనే మళ్లీ తిరిగి మొదట ఉన్న పార్టీలోకే మారడంతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ చర్చ వేడెక్కింది. ఎప్పటికప్పుడు అభ్యర్థులు అంచనాలు వేస్తూ ఏ పార్టీ అయితే తమకు కలిసి వస్తుందే లెక్కలు వేసుకుంటూ ముందుకెళ్తున్నారు. బాన్సువాడ మండలం రాజకీయం రసవత్తరంగ మారింది. హన్మాజీపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 24 గంటల సమయంలోనే వారు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి సమక్షంలో తిరిగి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

తుదిదశకు ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 3.97లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- 112 కొనుగోలు కేంద్రాలు మూసివేత
- రూ. 950.33 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు
- 80 శాతం రైతులకు రూ.762.86 కోట్లు జమ

కామారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నెలరోజుల పాటు సాగింది. ప్రస్తుతం కొనుగోళ్లు తుదిదశకు చేరుకున్నాయని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సన్నాలకు ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాలోనే విక్రయించారు. దీంతో జిల్లాలో 69,636 రైతుల నుంచి 3.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

3.97 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

ఈ సీజన్‌లో కొనుగోళ్ల ప్రక్రియకు జిల్లా వ్యాప్తంగా 429 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3,97,795 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చి న హామీ మేరకు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఈ సీజన్ నుంచి అమ లుచేసింది. ఈ నేపథ్యంలో సన్నాలు, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లకై వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం సేకరించారు. ఇప్పటికే 112 కొనుగోలు కేంద్రాలను మూసివేశారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో 86,930 మెట్రిక్ టన్నులు, ఎల్లారెడ్డిలో 1,45,536, బాన్సువాడలో 71,596, జుక్కల్‌లో 93,732 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

రూ.950 కోట్ల విలువ చేసే ధాన్యం సేకరణ

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.950 కోట్ల విలువైన 3,97,795 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 3.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేశారు. 3.34 మెట్రిక్ టన్నుల ధాన్యానికి ట్రక్ షీట్లను జనరేట్ చేశారు. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్‌లకు తరలించారు. 3.19లక్షల మెట్రిక్ టన్నులకు సంబంధించి 80 శాతం మంది రైతులఖాతాలో రూ.762 కోట్ల నగదు జమచేశారు. ఇంకా 20శాతం ధాన్యం డబ్బులు రావాల్సి ఉంది.



కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబెట్టిన దృశ్యం

రూ.71.27కోట్ల బోనస్ చెల్లింపు

ఈ సీజన్‌లో 41,871 మంది రైతుల నుంచి రూ.413.63 కోట్ల విలువచేసే 1,59,927 మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని కొనుగోలుచేశారు. ఇందులో 24,059 మంది రైతులకు సన్నరకం వరికి బోనస్ కింద రూ.71.27కోట్ల డబ్బులను ప్రభుత్వం అదనంగా చెల్లించింది.

వారంలో పూర్తవుతాయి

నెల రోజులుగా ఎలాంటి ఆటంకం లేకుండా కొనుగోళ్లు చేపడుతున్నాం. మరో రెండు వారాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయి. కొనుగోళ్లు పూర్తయిన వాటికి ఇప్పటికే 80 శాతం మంది రైతులకు డబ్బులు ఖాతాల్లో జమ చేశాం. బోనస్ రూ.71కోట్లు చెల్లించాం.

- శ్రీకాంత్, డీఎం, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

మద్నూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్, డోంగ్లి మండలాల్లో నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని మద్నూర్ ఎంపీడీవో రాణి, డోంగ్లి ఎంపీడీవో జగదీష్ తెలిపారు. డిసెంబర్ 3 నుంచి 5 వరకు నామినేషన్ల స్వీకరణ, డిసెంబర్ 6న నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ 9న అభ్యర్థుల విత్ డ్రా, డిసెంబర్ 17న ఎన్నికలు, అదే రోజు ఫలితాల వెల్లడి ఉంటుందని తెలిపారు. మద్నూర్ మండలంలోని 21 గ్రామ పంచాయితీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఎనిమిది క్లస్టర్లను ఏర్పాటుచేశారు. డోంగ్లి మండలంలో 12 గ్రామ పంచాయితీ అభ్యర్థులు నామినేషన్ వేయడానికి నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేశారు.

సర్పంచ్ అభ్యర్థి నామినేషన్‌కు ఎమ్మెల్యే రాక



నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పిట్లం కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. పిట్లం కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి కుమ్మరి శేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు, నాయకులతో కలిసి భారీ ర్యాలీగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలు, నాయకులు, అభిమానుల కోలాహలం, ఉత్సాహం చూస్తుంటే.. ఇది నామినేషన్ ర్యాలీలా లేదు విజయోత్సవ ర్యాలీలా ఉందని అన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులకు ప్రచార అస్త్రాలు అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి, మోహన్ రెడ్డి, సూరత్ రెడ్డి, కుమ్మరి రాములు, ఇమ్రోజ్, గంగారాం, మోయిన్, అశోక్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హోరా హోరీగా నామినేషన్లు



నామినేషన్లు వేసేందుకు క్యూలో ఉన్న అభ్యర్థులు

మోపాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన పార్టీల నాయకులు నామినేషన్లు హోరా హోరీగా దాఖలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు ఈ ప్రక్రియ సాగింది. మోపాల్ మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో హోరాహోరీగా నామినేషన్లు దాఖలు చేశారు. నర్సింగ్‌పల్లి గ్రామంలో మాత్రం సర్పంచ్ అభ్యర్థిగా లిఖిత ఒకే ఒక్కరు నామినేషన్‌ను దాఖలు చేశారు. 10 వార్డులకు సైతం ఒక్కో నామినేషన్ దాఖలైందని అధికారులు తెలిపారు. మిగతా పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 4 నుంచి 5 నామినేషన్లు వేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులను విత్‌డ్రా చేయించేందుకు అధికార పార్టీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. నర్సింగ్‌పల్లిలో సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు ఒక్కో నామినేషన్ దాఖలవడంతో వీడీసీ పెద్దలు ఏకగ్రీవం చేశారు. మంగళవారం సాయంత్రం 5లోపు వచ్చిన నామినేషన్లను స్వీకరించారు.

దివ్యాంగులకు మండల స్థాయి క్రీడాపోటీలు



గాంధారిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గాంధారి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలను మండల విద్యాధికారి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులలో ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఈ పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. వారు సాధారణ ప్రజలతో సమానంగా ఉన్నారనే విషయాన్ని తెల్పడానికి ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడా పోటీలతో విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటయ్య పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో రాజేంద్రకుమార్

మోపాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న నామినేషన్ కేంద్రాలను ఆర్‌డీవో రాజేంద్రకుమార్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని కులాస్‌పూర్, నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లి, మంచిప్ప నామినేషన్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. అభ్యర్థుల నుంచి తీసుకున్న నామినేషన్ పత్రాలను పరిశీలించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట మండల, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

కల్లు దుకాణాల్లో తనిఖీలు



వాడిలో కల్లు దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎల్లారెడ్డి ఎక్సైజ్ అధికారులు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న కల్లు దుకాణాల్లో మంగళవారం ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని వాడి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నడుపుతున్న కల్లు దుకాణం పైన చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. దుకాణాల్లోని కల్లు శాంపిళ్లను సేకరించామన్నారు. వాడి గ్రామంలో మల్లాగౌడ్ ఎలాంటి అనుమతులు లేకుండా కల్లు దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియగా, దుకాణం సీజ్ చేశామన్నారు. మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపైన సైతం చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా.. గ్రామం మధ్యలో ఉన్న వైన్ షాపును ఇతర చోటికి తరలించాలని గ్రామస్థులు ఈ సందర్భంగా ఎక్సైజ్ ఉన్నత అధికారులకు ఫిర్యాదులు అందించారు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ఈ వైన్ షాపు ఆలయాలకు, విద్యాలయాలకు, పాఠశాలలకు వంద మీటర్ల దూరంలోనే ఉందన్నారు. అయినప్పటికీ గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో విచారణ కొనసాగుతుందని విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై మహేష్

కానిస్టేబుల్‌పై దాడి.. వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 1న ఇనాందారు గల్లీకి చెందిన రేష్మ అనే మహిళ తన భర్త నజీమ్ తరచూ మద్యం సేవించి వేధిస్తున్నాడని 100కు డయల్‌చేసి ఫిర్యాదు చేసిందన్నారు. వెంటనే పెట్రోకార్ సిబ్బందిలోని కానిస్టేబుల్ సాయికుమార్ ఘటన స్థలానికి చేరుకుని నజీమ్‌తో మాట్లాడగా విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా ఇంట్లో ఉన్న కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన కానిస్టేబుల్ దాడి నుంచి తప్పించుకున్నాడని పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అయ్యప్ప స్వాముల పాదయాత్ర

రామారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాకేంద్రానికి చెందిన పలువురు అయ్యప్పస్వాములు గురుస్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామారెడ్డి మండలంలోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయానికి మంగళవారం పాదయాత్రగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అయ్యప్పస్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు కిరణ్‌స్వామి, శ్రీకర్ స్వామి, జగన్ స్వామి, మణికంఠ స్వామి, శ్రీనివాస్ స్వామి, మధుసూదన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి

పెద్దమ్మ ఆలయంలో పూజలు

మోపాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదక్‌పల్లి పెద్దమ్మ తల్లి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని రెండు రోజుల నుంచి ఆలయ కమిటీ పెద్దలు, గ్రామస్థులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు ఏటా డిసెంబర్ 2న ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు. వార్షికోత్సవంలో కుల పెద్దలందరూ పాల్గొని 5 రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఆనందంగా వస్తుందని కుల పెద్దలు అబ్బరెడ్డి, మల్లేషం, ఈదుల్ల భూమయ్య, రవి, సాయిలు పేర్కొన్నారు. మంగళవారం హోమం, యజ్ఞ కార్యక్రమాన్ని జరిపారు. బుధవారం గ్రామం నుంచి ఆలయం వరకు బోనాలతో ఊరేగింపు నిర్వహించనున్నామని తెలిపారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



తులసీ గద్దెలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

మహమ్మద్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్ గ్రామంలో మంగళవారం గీతాజయంతి వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం హనుమాన్ మందిరంలోని రుక్మిణీ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి గోపాల కాల్వలు, విష్ణు భగవంతుడు, తులసీ గద్దెలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం హన్మాండ్లు మహారాజ్ ప్రవచనం వినిపించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పంచాక్షరి, గ్రామస్థులు వెంకట్‌రావ్ పంతులు, భూంరెడ్డి, లక్ష్మారెడ్డి, విఠల్, కాశీరాం, వెంకట్ రామాగౌడ్, కాశాగౌడ్, పాల్గొన్నారు.

ఉపన్యాస, వ్యాసరచన పోటీలు



కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో ఆంధ్రయ్య

కమ్మర్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలోని నైపుణ్యత, కమ్యూనికేషన్ స్కిల్స్ సాధించేందుకు టీఎస్‌స్కిట్, భారతి ఏర్‌టెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపన్యాసంలో జూనియర్ విభాగంలో ప్రథమ పి.చిన్నబాబు (జడ్పీహెచ్ఎస్ బషీరాబాద్), ద్వితీయవిభాగంలో రూపేష్ (జడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లి), సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం అమూల్య, ద్వితీయ మధుప్రియ (జడ్పీహెచ్ఎస్ బషీరాబాద్), వ్యాసరచన పోటీల్లో జూనియర్ విభాగంలో శివాగౌడ్ (జడ్పీహెచ్ ఎస్ కోనాసమందర్) ప్రథమస్థానం, ప్రసన్న (జడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లి) ద్వితీయస్థానం, సీనియర్ విభాగంలో కార్తికేయ (జడ్పీహెచ్ ఎస్ కమ్మర్‌పల్లి) ప్రథమ, సందీప్ (జడ్పీహెచ్ఎస్ కోనాసమందర్) ద్వితీయస్థానంలో నిలిచారు. విజేతలకు మండల ఎంఈవో ఆంధ్రయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈఎల్‌టీఏ ఉపాధ్యాయులు రవింద్ర, మహికాంత్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో ప్రశంసాపత్రాలతో విజేతలు

రెంజల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్ అండ్ అడిక్వెస్ట్ టెస్టలను ఎంఈవో ఆంజనేయులు ప్రారంభించారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేందుకు ఈ టెస్టలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగం గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.శంకర్, గులాం, పీఆర్‌టీయూ మండల మాజీ ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, మండల ఇంగ్లిష్ కోఆర్డినేటర్ కమర్‌ఉన్నీసా బేగం పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో మండల స్థాయి ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఒలంపియాడ్ సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో వేల్పూర్ పాఠశాలకు చెందిన రోహన్, జూనియర్ విభాగంలో అంక్సాపూర్ పాఠశాలకు చెందిన సహస్ర, ఉపన్యాస పోటీలలో సీనియర్ విభాగంలో వేల్పూర్‌కు చెందిన జె.పల్లవి, జూనియర్ విభాగంలో వేల్పూర్‌కు చెందిన ఎస్‌కే. నూరిద్దీన్ గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్న బహుమతులు అందజేశారు.



బోధన్‌లో పరీక్ష ప్రారంభిస్తున్న ఎంఈవో

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లోకి బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున చేరుతున్నారని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి విజయానికి కృషిచేస్తామని పార్టీలో చేరిన రాములు, బాల్‌రాజు, సాయిరాంగౌడ్, హర్షవర్ధన్, శ్రీమాన్, చందు, సతీష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఇలియాస్, కుంట లింగారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..


బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న నాయకులు

బాన్సువాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు అంజయ్య, సిద్దప్ప, వహీద్, గౌస్, బషీర్‌ఖాన్, షేక్ జుబేర్, షోయబ్, అమీర్, కలీం మంగళవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు మొగులయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు..


బీజేపీలో చేరిన నాయకులతో పార్టీ జిల్లా అధ్యక్షుడు


బాన్సువాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. మంగళవారం మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన పలువురు యువకులు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చడమే కాకుండా, దేశంలో ప్రజలకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై దేశం కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, తుప్తి ప్రసాద్, సున్నం సాయిలు, హన్మాండ్లు, అరుణ్, సాయిలు, నవీన్‌గౌడ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘాల నిరసన

కామారెడ్డి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయకుండా యాదగిరి యాదవ్‌ను కిడ్నాప్ చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డిలోని యాదవ సంఘాలు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి అర్కల ప్రభాకర్ మాట్లాడుతూ.. రౌడీ షీటర్ సందీప్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలు, మంత్రి కోమటిరెడ్డి అనుచరుడు బీసీ బిడ్డ అయిన యాదగిరి యాదవ్ మీద దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యాదగిరిని సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయకుండా కిడ్నాప్ చేయడమే కాకుండా తీవ్రంగా గాయపర్చారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి భర్తరఫ్ చేయాలని, లేని పక్షంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. యాదవ సంఘాల నేతలు కృష్ణయాదవ్, జగదీష్‌యాదవ్, లింగం, రాజేష్, చంద్రం, రాజు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: కామారెడ్డిలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళ వారం యాదవ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. నల్గొండ జిల్లా లోని తిప్పార్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామంలో సర్పంచ్‌కి నామినే షన్ వేయకుండా నర్సింగ్ యాదవ్‌ను కొందరు రౌడీ షీటర్లు కిడ్నాప్ చేయడమే కాకుండా దాడి చేయడాన్ని సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేని పక్షంలో యాదవ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేప డతామని హెచ్చరించారు. కుంబాల లక్ష్మణ్, భూమేష్, వెంకట్, మురళి, బాను, ప్రభాకర్, బాలన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


సైబర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్పీ రాజేష్‌చంద్ర విద్యార్థులతో కలిసి ఫ్రాడ్‌క ఫుల్‌స్టాప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై పోలీసు శాఖ ప్రత్యేక అవగాహన కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఫ్రాడ్ క ఫుల్‌స్టాప్ అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. 6 వారాల పాటు ఈ అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని బెదిరించి బంగారం అపహరణ

బీర్కూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగ్ ఏడ్గి గ్రామానికి చెందిన వృద్ధురాలు అనూషాబాయిని గుర్తు తెలియని వ్యక్తి బెదిరించి నగలు అపహరించుకుపోయారు. వివరాలు ఇలా.. బరంగ్‌ఏడ్గికి చెందిన అనూష బాయి మంగళవారం బీర్కూర్ సంతకు వెళ్లింది. తిరిగి బస్టాండ్ వైపు నడుస్తూ వెళ్తుండగా వెనక నుంచి ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి మాట్లాడించాడు. తాను కూడా బరంగ్ ఏడ్గి వెళ్తున్నానని నమ్మబలికి బైక్‌పై ఆమెను కూర్చోబెట్టుకుని వెళ్లాడు. బైరాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనం నిలిపి, తన వద్ద ఉన్న కత్తి బయటకు తీసి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు ఇవ్వాలని బెదిరించాడు. ఆమె ప్రతిఘటించడంతో బలవంతంగా తెంపుకొని అక్కడినుంచి పరార్ అయ్యాడు. 7 గ్రాముల బంగారు గుండ్లు అపహరించినట్లు బాధితురాలు వాపోయింది. స్థానికులు గమనించి పోలీసులకు ఫోన్ చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీ శబరి మాత మూల విరాట్

ఆలయ ప్రాంగణంలో కోనేరు - ముస్తాబైన శబరిమాత ఆలయం

శబరిమాత జీవసమాధికి 26 ఏళ్లు

- తాడ్వాయి శబరిమాత ఆశ్రమానికి ఘనమైన చరిత్ర
- నిత్యం 200 మందికి అన్నదానం
- ఏటా డిసెంబర్‌లో వార్షికోత్సవాలు

ఆధ్యాత్మికం

తాడ్వాయి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు.. ఆహ్లాదకర వాతావరణం.. పక్కనే తాడ్వాయి చెరువు.. చూడ చక్కని హనుమాన్ విగ్రహం.. వీటి మధ్యన వెలసిన క్షేత్రమే శబరిమాత ఆశ్రమం. తాడ్వాయిలో వెలసిన ఈ ఆశ్రమంలో కోరిన కోరికల ను తీర్చే తల్లిగా శబరిమాతను కొంగు బంగారంగా వివిధ రాష్ట్రాల భక్తులు కొలుస్తారు.

నేటితో జీవసమాధికి 26 ఏళ్లు

శబరిమాత ఈ ఆశ్రమంలోనే సమాధి పొంది నేటికీ 26 సంవత్సరాలు పూర్తి కావస్తుంది. దీంతో ఆలయ కమిటీ నిర్వాహకులు డిసెంబరు 4, 5వ తేదీల్లో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున కాలినడకన బయలుదేరి ఆశ్రమానికి చేరుకుంటారు. ఈ ఉత్సవాల్లో రుద్ర, సహిత, నవ, చండీ హోమము మహాత్ముల దివ్య ప్రవచనాలు, పాదుక పూజలు, సీతారామ కల్యాణ మహోత్సవం, రథోత్సవంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఆట పాటలతో కనుల పండువగా వేడుక జరుపుకుంటారు. ఈ ఉత్సవాలకు మహారాష్ట్ర, కర్ణాటక బీదర్, తెలంగాణ రాష్ట్రాలలోని భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆశ్రమానికి ఘనమైన చరిత్ర

శబరిమాత మెదక్ జిల్లాలోని తొగుట గ్రామంలో ముదిరాజు వంశానికి చెందిన మల్కయ్య వీరమ్మ దంపతులకు 1945లో అష్టమ సంతానంగా జన్మించారు. ఆమె జన్మించిన 9 రోజులకు ఆ గ్రామంలో ఒక దివ్యయోగి రావడంతో ఇంటికి ఆహ్వానించగా ఈయన శబరిమాతకు మొదటగా జన్మనామం నాగలక్ష్మి అని నామకరణం చేశారు. చిన్ననాటి నుండే శ్రీరాముడి భక్తురాలిగా మారింది. 12 ఏళ్ల ప్రాయంలో ఇంటిని వదిలి నగర సంకీర్తనలు చేసే భక్తులతో కలిసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల మీదుగా కాలినడకన సాగిపోయింది. ఎన్నో గ్రామాలు దాటుకుంటూ లింగంపేట్ చేరుకున్నారు. అక్కడి నుంచి తాడ్వాయి దేశ్‌ముఖ్‌లు ఆమెను ప్రత్యక్ష దైవంగా కొలిచారు. వారు నివాసం ఉండే గడికోటలో ఆరేళ్ల పాటు నివాసం ఉన్నారు. శబరిమాతకు శ్మశానభూమి దగ్గర్లో ఓ కుటీరం ఏర్పాటుచేశారు. అక్కడే స్థిరపడ్డ శబరిమాత 2000లో జీవసమాధి అయ్యారు. అమ్మకు ఏర్పాటుచేసిన కుటీరమే పవిత్రస్థలమై భక్తులకు పుణ్యస్థలమైంది.

నిత్య అన్నదానం..

శబరిమాత ఆశ్రమంలో ఆలయకమిటీ సభ్యులు నిత్యన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నిత్యం 200 మందికి పైగా భక్తులు భోజనాలు చేస్తారు.

ఆశ్రమానికి చేరుకునే మార్గాలు

కామారెడ్డి నుంచి ఆశ్రమానికి చేరుకోవాలంటే 10 కి.మీ దూరం ఉంటుంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కనే ఉంటుంది. కామారెడ్డి బస్టాండ్ నుంచి తాడ్వాయి మీదుగా ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం తదితర మార్గాలకు బస్సుసౌకర్యం ఉంది.

కామారెడ్డిలో చోరీ

7 తులాల బంగారం, వెండి అపహరణ


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కామారెడ్డిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని సైలాన్‌బాబా కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైలాన్ బాబా కాలనీలో నివసించే మహ్మద్ వాయిద్ తన ఇంటికి తాళం వెసి సిద్దిపేటలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లే సరికి ఇంట్లోని వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండడం, వంట గదిలోని గ్యాస్ సిలెండర్ రెడ్యూటర్‌ను దుండగులు ఆన్ చేయడంతో గ్యాస్ లీక్ అయింది. దీంతో ఆందోళనకు గురైన బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఉన్న బీరువాలో నుంచి 7 తులాల బంగారం, 80 తులాల వెండి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు మహ్మద్ వాయిద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ సిబ్బందితో వేలిముద్రలను సేకరించి కాలనీలో గల సీసీ కెమెరాల అదారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

గుండెకు.. చలిపోటు

(5వ పేజీ తరువాయి)

'ఎంజైనల్ పెయిన్' అంటారు. ఇది గుండెపోటుకు హెచ్చరిక. చలి కాలంలోని వాతావరణ పరిస్థితుల వల్ల గుండెపై భారం పెరిగి గుండెపోట్లు అధికంగా నమోదు అవుతాయి. మిగతా సీజన్లతో పోలిస్తే.. చలికాలంలో గుండె వైఫల్యాలు ఇరవై శాతం అధికం. పని భారం పెరగడం వల్ల శరీరానికి అవసరమైనంత రక్తాన్ని గుండె పంపింగ్ చేయలేదు. ఫలితంగా ఊపిరితిత్తులపై ఒత్తిడి అధికమైపోయి ఆయాసంగా అనిపిస్తోంది. ఇన్‌ఫ్లూయంజా, వైరల్ ఫీవర్ వంటి ఇబ్బందులూ ఎక్కువే. ఈ ఇన్‌ఫెక్షన్స్ వల్ల కూడా గుండె వైఫల్యం ఎదురుకావచ్చు. అనేకానెక కారణాలతో.. చలికాలంలో గుండె లయ తప్పుతోంది. దీనినే 'ఎట్రియల్ ఫిబ్రిలేషన్' అంటారు. ఈ ప్రభావంతో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ఆస్కారం ఉంది. చలికాలంలో 'వెంట్రిక్యులర్ ఎరిక్మియా' కారణంగానూ కొన్నిసార్లు హఠాన్మరణాలు సంభవిస్తాయి. గుండె క్రమ పద్ధతిలో కాకుండా.. కొన్నిసార్లు చాలా వేగంగా కొట్టుకుంటుంది, కొన్నిసార్లు అనూహ్యంగా నెమ్మదిస్తోంది. దీంతో ఒక్కసారిగా గుండె స్తంభించిపోతుంది. 'సడెన్ కార్డియాక్ డెత్' అంటే ఇదే.

చలి కాలంలో జాగ్రత్తలు అవసరం

వాతావరణంలో చలి తీవ్రతలో మార్పులు వచ్చినప్పుడు రక్తనాళాలు కుంచించుకుపోతాయి. దీంతో రక్తపోటు పెరగడం, హృదయంపై ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు వస్తాయి. తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో గుండెపోటు వచ్చే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. వయస్సు పైబడిన వారికి ముందే గుండెవ్యాధులు ఉన్నవారు, షుగర్, బీపీ, కొలస్ట్రాల్ ఉన్నవారికి ఎక్కువగా గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుంది. గోరు వెచ్చని నీరు, పోషకాహారం, తేలికపాటి వ్యాయామం చలికాలంలో గుండెకు రక్షణగా ఉంటాయి.

- డా.జగదీష్ చంద్రబోస్, మెడికవర్ హాస్పిటల్, గుండెవైద్య నిపుణుడు

పండుగల పరవళ్లు

(5వ పేజీ తరువాయి)

ఉందని ఆలయ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ప్రతీ సంవత్సరం కంటే ఈసారి భక్తుల హాజరు మరింత పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంకటహర చతుర్థి.. వినాయకాలయాల్లో సందడి ఎక్కువ మంది భక్తులు ఎదురుచూసే సంకటహర చతుర్థి పూజలు డిసెంబరు 8 ఆదివారం జరగనున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు గణేశుని దర్శనానికి ఆసక్తిగా సిద్ధమవుతున్నారు. ఉపవాసంతో స్వామిని ప్రార్థించే మహిళలు ముందుగానే నైవేద్యాల కోసం అవసరమైన పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు. ఆలయాల్లో రాత్రి వరకు భజన కార్యక్రమాలు నిర్వహించేందుకు భక్త బృందాలు రిహార్సల్స్ పూర్తి చేశాయి. జిల్లా వ్యాప్తంగా గణపతి ఆలయాలు ఇప్పటికే దీపాలంకరణ లతో మరింత ఆకర్షణీయంగా మారాయి.

సఫల ఏకాదశి.. విష్ణు ఆలయాల్లో విశేషోత్సావాలు

డిసెంబరు 15 సోమవారం సఫల ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాలు భక్తులతో నిండిపోనున్నాయి. విష్ణుసహస్రనామ, గితా పారాయణాలకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. ఆలయాల అలంకరణలకు ప్రత్యేకమైన పువ్వులు, దీపాలు తెప్పించారు. ఉపవాస దీక్షలు తీసుకున్న భక్తులు ఉదయం నుంచే తీర్థప్రసాదం కోసం ఆలయాలకు చేరుకోనున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా స్వామివారి ఉత్సవమూర్తిని ప్రదక్షిణగా తీసుకెళ్లే కార్యక్రమం చర్చనీయాంశం అవుతోంది.

ధనుర్మాస ప్రారంభం..

డిసెంబరు 16 మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ధనుర్మాసం కోసం ఆలయాలు తెల్లవారుజామునే తెరుచుకోనున్నాయి. కొన్ని ఆలయాల్లో తిరుపతి శైలిలో పూజలు ఏర్పాటుచేస్తూ నిర్వాహకులు పనులు చేపట్టారు. ధనుర్మాసం పూజలు భోగి వరకూ కొనసాగుతాయి. డిసెంబరు 18న మాసశివరాత్రి కోసం శివాలయాలు సిద్ధమవుతున్నాయి.

అమ్మవారి శుక్రవారం..

డిసెంబర్ 19న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక శృంగార దర్శనం ఏర్పాటు చేయనున్నారు. చండీ పారాయణం, అష్టోత్తర శతనామార్చనలు జరగనున్నాయి. అమ్మవారి పూజలు ఇంటింటా ప్రత్యేకంగా నిర్వహించేందుకు కుటుంబాలు సిద్ధమవుతున్నాయి. సాయంత్రం అమ్మవారి తీర్థప్రసాదం కోసం ఆలయాల వద్ద భారీ క్యూలు ఉండటం ఖాయం.

దక్షిణామూర్తి ఏకాదశి

సంవత్సరం చివరి ముఖ్యమైన పూజల్లో ఒకటైన దక్షిణామూర్తి ఏకాదశి డిసెంబరు 30న జరగనుంది. ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, విద్యాశ్లోక పఠనాలు నిర్వహించేందుకు పురోహితులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం తీర్థప్రసాదం భక్తులకు అందించనున్నారు.

నిఘా నీడలో పంచాయతీ పోరు

(5వ పేజీ తరువాయి)

పంచాయతీల్లో పోలీసు శాఖ, సంబంధిత అధికారులు నిఘా ఏర్పాటుచేస్తూ ఎన్నికల సం దర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జ రగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు.

ఐదు చోట్ల ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు

ఎంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరిక ట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టింది. జిల్లాలో 5 ఎస్ఎస్‌టీ ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దుల ద్వారా జిల్లాలోకి, అలాగే జిల్లా నుంచి ఇతర జిల్లాలకు నగదు, మద్యం, ఉచిత ప్రలోభాలకు సంబంధించిన వ స్తువులు తరలిపోకుండా కట్టుదిట్టమైన ఏర్పా ట్లు చేసింది. ఇందులో భాగంగా మెదక్ - కా మారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామమైన పోచారం గ్రామం వద్ద, మాచారెడ్డి మండలంలోని ఘన పూర్, జుక్కల్ మండలంలోని సోఫూర్, మ ద్నూర్ మండలంలోని సలాబత్ పూర్, డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామాల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లాలోకి వచ్చి పోయే ప్రతీ వాహనాన్ని చెక్ పోస్టుల సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. 24 గంటలు చెక్ పోస్టుల్లో పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తూ వాహనాలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహి స్తున్నారు. అలాగే జిల్లాలో ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 24 గంటలు తిరుగుతూ వివిధ వాహనాలను తని ఖీలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు ప్రచారంలో భాగంగా ఓటర్లను ప్రలోభ పెట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. అభ్యర్థులు ఎవరైనా ఓటర్ల ను ప్రలోభ పెడుతూ డబ్బులు, మద్యం పంపి ణీ, నజరానాలను పంపిణీ చేసినందుకు పాల్ప డితే అలాంటి వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఓటరు నిర్భయంగా, నిష్పక్షపాతంగా తన ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేస్తున్నారు.

ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం

(5వ పేజీ తరువాయి)

జిల్లా ఎన్నికల అధికారి ఆశీష్‌సాంగ్వాన్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. బుధవారం నుంచి మూడవ విడతలోని బాన్సువాడ డివిజన్ పరిధిలో గల ఎనిమిది మండలాల్లో ఆయా గ్రామ పంచాయతీలు, వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మూడవ విడతలో బాన్సువాడ డివిజన్ పరిధిలోని బిచ్కుంద, డోంగ్లీ, జుక్కల్, మద్నూర్, పెద్దకొడ్ఎగల్, బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ ఎనిమిది మండలాల్లోని 168 సర్పంచ్, 1,482 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటి పరిధిలో నామినేషన్లు స్వీకరించేందుకు 55 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా బుధవారం మొదటి విడత నామినేషన్ల ఉప సంహరణ పూర్తి కానుంది. మొదటి విడతలో 167 సర్పంచ్ స్థానిలకు 951 మంది, 1,520 వార్డు స్థానాలకు 3,709 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో నేడు ఎంత మంది నామినేషన్లను ఉప సంహరించుకుంటారో చూడాలి.

పల్లెల్లో ఎన్నికల వార్

పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో వేడి నెలకొంది. స్థానిక అంశాలతో ముడిపడిన ఎన్నికలు కావడంతో ఈ అంశంపై చర్చ జరుగుతోంది. బరిలో ఎవరున్నారు, ఎవరు గెలిచే అవకాశాలు ఉన్నాయంటూ చర్చలు జరుపుతున్నారు. గ్రామ స్థాయిలో పార్టీల ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలు, ఉప సంహరణ, రెబల్స్‌తో మంతనాలు జరుగుతుండగా సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా నేతల వద్దకు వెళ్తున్నారు. మొదటి 2 విడతల ఎన్నికలు జరిగే గ్రామాల్లో రాజకీయం రసవత్తరంగా మారాయి.

సంక్షిప్త సమాచారం

వార్డు మెంబర్ల స్థానాలు ఏకగ్రీవం

కామారెడ్డిరూరల్: మండలంలోని ఉగ్రవాయి, క్యాసంపల్లి పంచాయతీల వార్డు మెంబర్ స్థానాలలో 2 ఏకగ్రీవమయ్యాయి. బీఆర్ఎస్ మద్దతు పలికిన ఉగ్రవాయి 7వ వార్డు అభ్యర్థి గడ్డమీది వెంకటలక్ష్మీ, క్యాసంపల్లి 9వ వార్డు తలమడ్ల ఆనంద్‌గౌడ్‌లు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఈ 2 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

అభివృద్ధిలో ముందుండాలి

దోమకొండ: మహిళా సంఘాల సభ్యులు అభివద్ధిలో ముందుకు సాగాలని చాముండేశ్వరీ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు మాణికోత్ అన్నారు. కామమణి సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో మంగళవారం దోమకొండ మహిళా సమాఖ్యను తనిఖీ చేసి అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, వ్యవసాయాధికారిణి మణిదీపిక, ఏపీవో రజిని, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల చోరీ..

దోమకొండ: మండలంలోని అంచనూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి 3 బోరు బావుల వద్ద కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు రైతులు తెలిపారు. రైతులు గాండ్ల రాములు, దేవరగట్టు తిరుపతి, మైసయ్యలకు సంబంధించిన కేబుల్ చోరీకి గురైంది.

పది పంచాయతీలు ఏకగ్రీవం

లింగంపేట: మండలంలోని 10 గ్రామ పంచాయితీలు ఏకగ్రీవమైనట్లు తెలిసింది. మంగళవారంతో నామినేషన్లకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు రాత్రి 7గంటల వరకు నామినేషన్లు వేశారు. మండలంలోని మెంగారం, రాంపల్లి, రాంపల్లితాండ, నల్లమడుగు పెద్దతండా, ఎల్లారం, సజ్జన్‌పల్లి, బాణాపూర్ తండా, ముంబాజీపేటతండా, ఎక్కపల్లితండా, ఐయ్యపల్లి తండాలు ఉన్నాయి. విత్ డ్రా వరకు మరిన్ని పంచాయితీలు ఏకగ్రీవం చేసేందుకు ఆయా గ్రామాల పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని శెట్పల్లి గ్రామంలో రాత్రి 8గంటల వరకు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

లింగంపేట: మండలంలోని శెట్పల్లి, ఎక్కపల్లి నామినేషన్ కేంద్రాలను ఆర్డీవో పార్థసింహారెడ్డి తనిఖీ చేశారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో నరేష్, ఆర్‌వోలు ఉన్నారు.

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని ఎల్లారెడ్డి, భిక్కనూరు, లక్ష్మాపూర్ గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. మండల పరిధిలో 31 పంచాయతీలకు 8 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు.

అత్యధిక సర్పంచ్ స్థానాలు గెలుపొందాలి

సదాశివనగర్: ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది కేసీఆర్‌కు బహుమతిగా అందిద్దామని మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని 24 గ్రామాల్లో బీఆర్ఎస్ నుంచి బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు కృషిచేస్తున్నారు. తిర్మన్‌పల్లి ఎస్టీ రిజర్వేషన్ కావడంతో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి కండువా వేశారు.

కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు

మహమ్మద్‌నగర్: మండలంలోని తూంకీపల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పెద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు లోక్యానాయక్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

భిక్కనూరు: గర్భిణులు తమ సూచ నలు పాటిస్తూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని భిక్కనూరు ప్రాథమిక వైద్యురాలు దివ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ.. గర్భిణులు తమ సూచనలు పాటించాలని, ప్రభుత్వ దవాఖానాలోనే కాన్పు చేయించుకోవాలన్నారు. అవసరమైన గర్భిణులకు మందులు అందించారు.

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

బాన్సువాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని 25 ఎంచాయతీలకు 3వ విడత ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీవో ఆనంద్ మంగళవారం తెలిపారు. 8 కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. 8మంది రిటర్నింగ్ అధికా రులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉంటారని తెలిపారు. ఉద యం 10:30 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.


నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భగీరథ.. నీరంతా వృథా

బాన్సువాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని జక్కల్‌దాని తండా నుంచి ఇబ్రహీంపేట్‌కు వెళ్లే ప్రధాన దారి వెంట ఉన్న పంటపొలాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ గత 15 రోజులుగా లీకేజీ అవుతుండటంతో నీరు భారీగా వృథా అవుతుంది. వృథా అవుతున్న నీరు పంటపొలాల్లో చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. నీటిని సంరక్షించాలని ప్రభుత్వం తరచూ అవగాహన కల్పిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు వృథా అవుతుండటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటివృథాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


పంటపొలాల్లో పారుతున్న నీరు

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రాకింగ్ తాలూకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి రాజు వెడ్స్ రాంబాయి
వెంకటేశ్వర ఆంధ్రాకింగ్ తాలూకా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230